'రచన' మాసపత్రిక – డిసెంబర్ 1991

# కథ ప్రహేళిక -1

# సయ్యాట

వాళ్ళిద్దరూ ప్రేమించుకోలేదు. పెళ్ళి చేసారు. అయినా రాధ సాగర్‌ని ప్రేమించాలనుకుంది. ఆమె ప్రేమకు ఆదిలోనే ఆటంకమెదురయింది. దాన్నెలా తొలగించుకోవాలి? – రాధ ప్రశ్నించుకుంది. గీతను ఆశ్రయించింది. 'సాగర్‌ని రెచ్చగొట్టు' గీత ఉపదేశించింది. రాధ ఉపక్రమించింది.

❁ ❁ ❁

"రండి రండి జగన్నాధంగారూ!"

జగన్నాధం వచ్చి సోఫాలో కూర్చున్నాడు.

ఆ సోఫాను, ఇతర సామగ్రినీ చూస్తున్నాడు జగన్నాధం.

రాధ వంటింట్లోకి వెళ్ళి కాఫీ తయారు చేస్తోంది.

ఈ సోఫాలు, కుర్చీలు ఈ అమ్మాయి తీసుకువచ్చినట్లుంది.

"ఒకప్పుడు ఈ గదిలోనే చాపల మీద తంటాలు పడేవాళ్ళం! తెల్లారేసరికి నడుం నెప్పీ, మోకాళ్ళు నెప్పులూనూ! మంచి నీళ్ళు కూడా ఉండేవి కావు" – జగన్నాధం ఆ గదిలో గడిపిన రాత్రుళ్ళు గుర్తు చేసుకుంటున్నాడు.

'ఇప్పుడు ఈ మాత్రం జాగా కూడా దొరకటంలేదు. వందలకి వందలు పోస్తే

దొరుకుతుంది. అంత ఖర్చుకి ఎవరూ ముందుకి రావటం లేదు' అనుకున్నాడు.

రాధ కాఫీ పట్టుకు వచ్చింది.

"ఏంటమ్మా?" అన్నాడు.

రాధ మాట్లాడలేదు.

"సాగర్ ఏమయినా అంటున్నాడా?"

దానికీ జవాబీయలేదు.

"చెప్పమ్మా!" అన్నాడు.

"మీరు పెద్దవారు" అంటూ ఆగింది. తల వంచుకునే అంది.

"ఆయన..... ఆయన..."

భోరుమంది రాధ. బతిమాలించుకుంది. చెప్పింది.



"మీరేం చేస్తారో ఏమో! నాకు చచ్చిపోవాలనుంది. మీ అంత మంచి ఫ్రెండ్ లేరంటారాయన" అంది.

జగన్నాథం తెల్లబోయాడు.

నెమ్మదిగా తేరుకున్నాడు – "నేను ఆలోచిస్తాన్లే! మళ్ళీ మాట్లాడుకుందాం" అన్నాడు.

రాధ అతన్ని సాగనంపింది.

❁ ❁ ❁

'ఎంత సిగ్గులేదీ అమ్మాయికి?' అనుకున్నాడు జగన్నాథం ఆ ఇంట్లోంచి బయటపడగానే!

'సాగర్ చూడడానికి బాగానే ఉంటాడే!' అని కూడా అనుకున్నాడు.

ఆలోచనలేవీ నిలవటం లేదు.

దృష్టంతా రాధ రూపం మీదకు పోతోంది.

రాధ ముఖం తీర్చిదిద్దినట్లుంటుంది. కొనదేలిన ముక్కు... పలుచని చిన్ని పెదాలు... నున్నటి బుగ్గలు...

జగన్నాథం తెలిసిన పదాలతో రాధ ముఖాన్ని గుర్తు చేసుకునే ప్రయత్నంలో పడ్డాడు. ఊహలు రాధ ముఖం మీద నిలవటం లేదు. అంతకన్న కిందకు సాగుతున్నాయి. అతనెంత ప్రయత్నించినా ఆమె యవ్వన భాండాల కొలతలు ఊహకు అందటం లేదు.

అంతకు పూర్వం అతనెప్పుడూ వాటి మీద దృష్టి నిలపలేదు. అందుకు జగన్నాథానికి చిరాగ్గా వుంది. తాను తిరిగి వెళ్తే?

జగన్నాథానికి పిచ్చెత్తినట్లుంది.

అతను ఆ రోజు ఇంట్లో భార్యాపిల్లల్ని కసురుకున్నాడు. అన్నం దగ్గర్నుంచి సగంలో లేచిపోయాడు.

'ఇదేంటమ్మా నాన్న ఇలా ఉన్నారు?' అంది డిగ్రీ చదువుతున్న పెద్దకూతురు, తన కళ్ళజోడు లోంచి చూస్తూ.

జగన్నాథం చొక్కా తగిలించుకుని బయటపడ్డాడు. రెండు మూడు రోడ్లు తిరిగాడు.

జేబులో డబ్బులు లెక్కపెట్టుకుని ఉమర్‌ఖయామ్ బార్‌లో దూరాడు. ఒక లార్జ్ పెగ్ విస్కీని తెప్పించుకున్నాడు. అందరూ గుంపులుగా ఉన్నారు. తనలా ఒక్కళ్ళూ ఒకరిద్దరున్నారు. వాళ్ళు తెప్పించుకున్న పదార్థాలు జగన్నాథాన్ని కొంచెం ఆశ్చర్యపరచాయి. ఆకర్షించాయి.

తమ ఆఫీసులో అంతా తనలాంటి వాళ్ళే. ఎవరూ ఇలా ఇంత ఖరీదయిన బార్‌కి వెళ్ళరు. ఒక డిఫెన్సు రమ్ ఇరవై రూపాయల్తో సంపాదించి మరో ఇరవై ముప్పైలతో ఏవో గడ్డి కొనుక్కుని ఆరుగురూ పేకాడుతూ రాత్రంతా సాగర్ గదిలో కాలక్షేపం చేసేవారు.

ఇప్పుడా సాగర్‌కి పెళ్ళయిపోయింది. రమ్ దొరుకుతుంది. ఏ హోటల్లోనో కార్క్ ఛార్జీలు ఇచ్చి తాగుతున్నా తిండికి తడిసి మోపెడవుతోంది. పేకాట అసలు కుదరటం లేదు.

'మరి ఈ బార్లలో ఒక్కళ్ళూ కూర్చుని తాగేవాళ్లకి రోజుకి ఎంతలేదన్నా వందయినా అవుతుందేమో!' అనుకున్నాడు జగన్నాథం.

లార్జ్ పెగ్ విస్కీ కడుపులోకి జారినా జగన్నాథానికి అక్కడ సుఖంగా అనిపించలేదు.

అతను అక్కడి నుండి బయటపడ్డాడు.

కొంత దూరంలో ఇంగ్లీషు సినిమా పోస్టరుతో సినిమా హాలు కనిపించింది.

ఓ మూలలో ఎ సర్టిఫికెట్ గుర్తు కనిపించింది.

జగన్నాథానికి ఇంగ్లీషు సినిమాలు అలవాటు లేదు. అతను ఇంగ్లీషు సినిమాలలో ముద్దులు గట్రా ఉంటాయని విన్నాడు.

డబ్బులు లెక్క చూసుకుని హాల్లోకి జొరబడ్డాడు. రెండో ఆట. జనం పలచగా ఉన్నారు. హాలు మాత్రం చల్లగా ఉంది. జగన్నాథానికి సినిమా ఎక్కటం లేదు. వంటికి మాత్రం సుఖంగా ఉంది.

ఆలోచనలు రాధ మీదకు పరిగెడుతున్నాయి.

సాగర్ నపుంసకుడని రాధ తనతో ఎందుకు చెప్పింది?

జగన్నాథం బుర్రను రకరకాలుగా దొలుస్తోందా ప్రశ్న.

అప్పటికప్పుడు వెళ్ళి రాధను కలుసుకోవాలనిపిస్తోంది. సాగర్ ఉంటాడు. లాభం లేదు. మర్నాడు వెళ్ళాలి.

మరుసటి రోజు తొమ్మిదికల్లా ఆఫీసుకి పోతాడు సాగర్.

జగన్నాథం ఎనిమిదిన్నరకల్లా ఆ ప్రాంతానికి చేరుకున్నాడు. సాగర్ ఇంట్లోంచి బయల్దేరాడు.

జగన్నాథం మెల్లిగా ఆ ఇంటికి చేరుకున్నాడు.

ఒళ్ళంతా అదోలా ఉంది. నాలిక చిరుచేదుగా ఉంది. తల నాదుగా ఉంది.

గుండె ఉగ్గబట్టుకుని మునివేళ్ళతో తలుపు మీద కొట్టాడు. వెంటనే తలుపు తెరుచుకుంది.

"మీరా! రండి! రండి!" - రాధ కళ్ళు మెరుస్తున్నాయి. అప్పుడే స్నానం చేసినట్టుంది. ఒంటి మీద తడి ఉంది. తల దువ్వుకుంటున్నట్లుంది. మొహానికి అప్పుడే రాసిన పౌడరు.

సన్నగా, నాజూగ్గా ఉన్నా బలంగా ఉంది రాధ. రమ్మని వెనక్కి తిరిగి నడుస్తుంటే కదుల్తున్న రాధ వెనక భాగాలు జగన్నాథాన్ని కవ్విస్తున్నాయి.

'ఆనాడు వయసులో కూడ ఇంత అందంగా ఉండేది కాదు సీత' - అనుకున్నాడు

జగన్నాథం.

అసలు ఈ కవ్వింపే లేదు. ముడుచుకుని ఉండేది. తాము అనుభవించింది సెక్సేనా అసలు! చీకట్లో ఎవరో వెంటపడుతున్నట్లు భయపడిపోతూ ఉండేది సీత. ఇప్పుడదీ లేదు! నలభై ఏళ్ళకే అన్నీ అయిపోయాయి. సెక్స్ లాంటిది ఒకటి ఉందన్న విషయమే గుర్తుండడం లేదు.

ఈ రాధ నిజంగా నన్ను కరుణిస్తుందా!

ఆశ నిరాశల మధ్య కొట్లాడుతున్నాడు జగన్నాథం.

"కూర్చోండి!" అంది రాధ.

జగన్నాథం సోఫాలో కూర్చోబోయాడు.

"ఇక్కడ కాదు. ఎవరయినా చూస్తే బాగోదు" అంటూ పడక గదిలోకి దారి తీసింది.

చిన్ని గది. గదిలో మంచం పెద్దగా ఉంది. ఓ పక్క బీరువా ఉంది. డ్రెస్సింగ్ టేబుల్ మీద మిర్రర్ పొడుగ్గా ఉంది.

రాధ గది కిటికీలు మూసింది. తెరలు సర్దింది. ముందు గదిలోకి వెళ్ళి టేప్ రికార్డర్ ఆన్ చేసింది. ఏదో సంగీతం వినిపిస్తోంది. చెమటలు పడుతున్నాయి జగన్నాథానికి. అంతా అయోమయంగా ఉంది.

అంగ వేస్తే అందుతుంది రాధ.

ఎలా వెయ్యటం!

మాటలాడాలి.

ఏం మాటలాడాలి?

సాగర్ గురించి. 'అయ్యో!' అనాలి. తన లోపం తెలిసుంటే ఇలా పెళ్ళి చేసుకుంటాడా?

"అలాంటోడికి బుద్ధి చెప్పాల్సిందే రాధా! లేకపోతే నీలాంటి సౌందర్యరాశికీ, సుగుణాల రాశికీ ఇంత అన్యాయం చేస్తాడా! నువ్వు నాకు చెప్పటం మంచిదే. నువ్వు మాత్రం మనిషివి కాదా! ఉప్పు, కారం తినటం లేదా! మన మధ్య ఏం జరిగినా ఎవరికీ తెలియదు. ఎవరికీ అనుమానం రాదు. నాకు ఆపరేషను కూడా అయిపోయింది.

ఛీ!

ఏమిటా డైలాగులు! ఎన్ని సినిమాలు చూడటం లేదు. ఎన్ని పత్రికలు చదవటం లేదు. ఇలాంటి సందర్భంలో సంభాషణ ఇలాగా! మరెలాగా!"

జగన్నాథం ఆలోచనల్లో ఉండగానే రాధ వచ్చింది. మంచాన్ని ఆనుకుని ఉన్న పడక్కుర్చీలో కూర్చున్నాడు. రాధ చిరునవ్వుతో సమీపంగా వచ్చి వేళ్ళు తగిలిస్తూ చేతిలో గ్లాసు అందించింది.

"పాలు!"

"ఇదేంటి?" అన్నాడు.

పకపకా నవ్వింది.

"కనిపించటం లేదా! తాగండి!"

గబగబా తాగాడు.

రాధ రాసుకున్న సెంట్ పరిమళం ఫాను గాలిలో కలిసి గదిలో వ్యాపించింది.

గ్లాసు ఖాళీ చేసి "తీసుకో" అన్నాడు వణుకుతున్న గొంతుతో.

"అక్కడ పెట్టండి" అంది రాధ.

జగన్నాధం కాస్సేపు గ్లాసుని చేతుల మధ్య దొర్లించాడు. కింద నుంచాడు.

"సాగరు... సాగరు...ఐదేళ్ళ బట్టి తెలుసు కాని..." అన్నాడు రాధ పాదాలని చూస్తూ. పచ్చగా ఉన్నాయి. వేళ్ళు ముద్దొస్తున్నట్లు ఉన్నాయి. చీర బరువుగా ఉండి, కుచ్చిళ్ళు పాదాల మీద కదులుతున్నాయి.

"చెప్పండి" అంది రాధ ఒక కాలు ఇంకో కాలు మీద వేసుకుంటూ!

జగన్నాధానికి ఏం మాట్లాడాలనుకున్నాడో గుర్తు రావటం లేదు.

"పోన్లెండి! ఇలాంటి సమయంలో ఆ పాపిష్టివాడి గొడవెందుకూ?" అంది.

ఆమె గొంతు గమ్మత్తుగా ఉంది. కమ్మగా ఉంది.

జగన్నాధం తలెత్తి చూశాడు.

మంచం మీద కూర్చునుంది రాధ.

"మీకెన్నేళ్ళు?"

"ముప్పై ఏడు" - టక్కున జవాబిచ్చాడు.

రాధ నవ్వుతోంది.

ఎందుకు నా వయసు?

"ఇన్నేళ్ళొచ్చి ఈ మాత్రం తెలియదా అని!"

జగన్నాధం గొంతు ఎండిపోయింది.

నాలిక తడుపుకున్నాడు.

"నిజంగానా?" అన్నాడు వణుకుతూ!

రాధ మాట్లాడకుండా దుప్పటి అంచులని సరిచేయసాగింది.

"నాకు నమ్మబుద్ధి వెయ్యటం లేదు. నన్నెందుకు కరుణించావు?"

'కరుణించా'వన్న పదాన్ని వెతికి వెతికి వాడాడు.

"మీకు .... మీకు...." అంది రాధ.

జగన్నాథం కుర్చీలోంచి లేచాడు.

రాధ మంచం మీంచి లేవలేదు.

జగన్నాథం ఒక్క అంగలో ఆమెని సమీపించి చెయ్యి జాచాడు.

"లెండి! లెండి! సినిమా అయిపోయింది"

ఎవరో అంటున్నారు.

కళ్ళు విప్పి చూసాడు. కుర్చీల వరుసలన్నీ ఖాళీగా ఉన్నాయి. హాలు గేట్‌మెన్ భుజం పట్టుకు కుదుపుతున్నాడు.

జగన్నాథానికి జరిగింది అర్థం అయింది.

నీరసంగా, గుండె దడగా ఉంది.

కాళ్ళీడ్చుకుంటూ బయట కొచ్చాడు. రిక్షా ఎక్కాడు. తలుపు తట్టేసరికి సీత ఎదురుగా నిలబడింది.

భర్త చేయి పట్టుకు తీసుకువెళ్ళింది.

డిగ్రీ చదువుతున్న కూతురు తండ్రి మళ్ళీ తాగినందుకు భడేలున తలుపు వేసుకుంది.

సీత జగన్నాథాన్ని మంచం మీద కూర్చోబెట్టింది.

జగన్నాథం మంచం మీద కూలబడేసరికి ఆపుకోలేని దుఃఖం ఆవరించింది.

దుప్పటి కప్పుతున్న సీత అతని కళ్ళ నుండి కారుతున్న కన్నీటిని గమనించింది.

"ఏం జరిగిందండీ!" గాభరాగా ప్రశ్నించండి.

"ఛీ!ఛీ!ఛీ!" అంటూ తల తిప్పుతూ జగన్నాథం దుప్పటి పైకి లాగేసుకున్నాడు.

మరికొన్ని క్షణాల్లో అతని గుర్రు సీత ప్రశ్నలకి ఫుల్‌స్టాప్ పెట్టింది.

* * *

ఆ రోజు ఇంటికి వచ్చిన జగన్నాథానికి సీత చెప్పిన వార్త నిశ్చేష్టుడిని చేసింది.

మర్నాడు రాధకి సీమంతమట. గాజులు పెట్టిస్తారట. రాధ వాళ్ళ తరఫు వాళ్ళు వచ్చి పిలిచారట.

'ఎవడో పుణ్యం కట్టుకున్నాడు' అనుకున్నాడు జగన్నాథం ఉక్రోషంగా.

అది ఎంతసేపో నిలవలేదు.

'పోన్లే పాపం ఏం చేస్తుందీ' అనుకున్నాడు.

'అసలు ఆ సాగరుగాడు ఎలా భరిస్తున్నాడు?' - ప్రశ్నించుకున్నాడు.

సాగర్ మీద జాలీ, రాధ మీద కోపమూ విజృంభించాయి. క్రమంగా అవన్నీ వెనుకబడి 'ఎవడి ఖర్మ వాడిది! మనకేల?' అనుకున్నాడు.

* * *

రాధని పుట్టింటికి పురుటికి పంపాక సాగర్ మిత్రులను ఇంట్లో పార్టీకి పిలిచాడు.

"సాగర్ పార్టీ ఇస్తానంటున్నాడు" అన్నాడు గోపాలం జగన్నాథం సీటు దగ్గరకు వచ్చి.

"మీరు వెళ్ళండి" అన్నాడు జగన్నాథం.

"మీరు?"

"నేను రాను"

"అదేం? మీరు వెళ్ళటానికేం? నేనంటే ఎలాగూ రాననుకోండి" అన్నాడు గోపాలం.

జగన్నాథం కుతూహలంగా చూసాడు గోపాలాన్ని.

"ఏం బాబూ! ఏమిటి సంగతి?"

"అబ్బే ఏం లేదు" అన్నాడు గోపాలం.

"ఏదో ఉంది" జగన్నాథం గోపాలాన్ని పరిశీలనగా చూసాడు.

గోపాలానికి ముప్ఫై ఏళ్లు దాటాయి. ఇద్దరు పిల్లలు.

గోపాలం జవాబియ్యలేదు.

"మీరు ఆపరేషను చేయించుకున్నారా?"

గోపాలం తెల్లబోయాడు.

"అదేంటండీ సడెన్‌గా అలా అడుగుతున్నారూ?"

"మరేం లేదు" అంటూ మాట మధ్యలో ఆపాడు. గోపాలాన్ని మాటల్లో పెట్టి తన అనుమానం నిర్ధారించుకోవాలనుకున్నాడు జగన్నాథం. గోపాలం మధ్యలో లేచి వెళ్ళిపోయాడు.

సాయంత్రం ఆఫీసు అయ్యాక మిత్రులంతా మేం వెళ్ళటంలేదంటే మేం వెళ్ళటం లేదన్నారు. గోపాలం, రమేష్, కామరాజు, పురుషోత్తం - అంతా వివాహితులే. గోపాలం మీద అనుమానం స్థిరపడినా మిగిలిన వాళ్ళూ అదే ధోరణిలో మాట్లాడటంతో జగన్నాథం 'ఇందులో ఏదో కథ ఉంది' అనుకున్నాడు.

"కాఫీ తాగుదాం పదండి" అన్నాడు జగన్నాథం.

హోటల్లో కూర్చున్నారు అంతా!

"మనమంతా ఇన్నాళ్ళూ సాగర్‌ని పార్టీలకి పిలవటం లేదు. ఈరోజు అతను పిలుస్తుంటే వెళ్ళాలనుకోవటం లేదు. ఎవరూ పైకి తేలకపోయినా దీనికేదో బలమైన కారణముంది" అంటూ ఆరంభించాడు జగన్నాథం.

పురుషోత్తం ఏదో అడ్డు చెప్పబోయాడు.

జగన్నాథం అతన్ని వారించాడు.

"నా కారణం నేను చెబుతాను. మనమంతా చాలా నిజాయితీగా చెప్పుకుందాం! ఎవరేం చెప్పినా మన అయిదుగురిని దాటి బయటికి పోకూడదు" అన్నాడు.

ఎవరూ మాట్లాడలేదు.

"సాగర్ సంసారానికి పనికిరాడు. ఆ సంగతి అతని భార్య నాతో చెప్పింది. నాకు చాలా పాపపు ఊహలు కలిగాయి. దాంతో మొహం చెల్లలేదు. వాళ్ళింటికి వెళ్ళటం మానేసాను. పార్టీలకి సాగర్ వస్తే ఎప్పుడయినా నోరు జారుతానేమోనని భయంతో నెమ్మదిగా అతన్ని తప్పించాను"

తల వంచుకుని చెప్పాడు జగన్నాథం.

ఎవరూ మాట్లాడలేదు.

తలెత్తి అందరి మొహాల్లోకి చూశాడు.

"మనమంతా అతని ఇంటికి వెళ్ళొచ్చేవాళ్ళం. నా సంగతి నాకు తెలుసు గనుక మిగిలిన వాళ్ళు మీ నలుగుర్లోను ఎవరో ఒకరు"

అంతా ఒకరి మొహాలొకరు చూసుకున్నారు.

గోపాలం అన్నాడు -

"ఆ అమ్మాయి నాకు ట్రై చేసింది. చీవాట్లు పెట్టాను. పిల్లల కోసం అలా వీధిలో పడాలా? ఛీ!ఛీ!"

కామరాజు వయిపు చూసాడు జగన్నాథం.

"సాగర్ పెళ్ళానికి పిచ్చేదో ఉంది" అన్నాడు.

మిగిలిన వాళ్ళు చిత్రంగా చూశారు.

"నేనేం మడిగట్టుకుని కూర్చోలేదు. మన మధ్య ఇలాంటివి మాట్లాడుకునే ఫ్రెండ్‌షిప్ లేదు కనుక చెప్పలేదు. లేకపోతే ఎప్పుడో చెప్పేవాణ్ణి! తన భర్త పనికిరానివాడని ఏ భార్యయినా పరాయి మొగుడితో అందీ అంటే అందులో సిగ్నల్ ఏంటో నాకు తెలుసు! నాతో అనలేదు ఆ అమ్మాయి, అంటేనా..." అన్నాడు.

"ఆమెకు పిచ్చంటున్నావా?" అన్నాడు గోపాలం.

"లేకపోతే జగన్నాథంగారినీ, నిన్నూ పట్టుకోవటమేంటి?" అన్నాడు కామరాజు.

గోపాలం అనుమానంగా అడిగాడు -

"నీ మాటలు నమ్మబుల్‌గా లేవు. సాగర్ పెళ్ళయిన కొన్ని నెలల దాకా మన పార్టీలకు రెగ్యులర్‌గా వచ్చేవాడు. తరువాత లేదు. మనం పిలవలేదు. ఎందుకు రావటంలేదని నువ్వెప్పుడూ అడగలేదు"

కామరాజు నవ్వాడు.

"కొత్త పెళ్ళాన్ని ఇంట్లో పెట్టుకుని మన వెనకాల తిరగడమేంటని నేనే వాడినొకమారు తిట్టాను. రాకపోతే ఆ అమ్మాయి గట్టిదే, కట్టేసుకుందనుకున్నాను"

గోపాలానికి అనుమానం తీరలేదు.

"నువ్వు నిజం చెప్పటం లేదు" అన్నాడు.

"నీకులా అబద్ధం చెప్పాల్సిన అవసరంలేదు" అన్నాడు కామరాజు.

గోపాలం మొహం మాడిపోయింది.

జగన్నాథం కలగజేసుకున్నాడు.

"ముందుగానే చెప్పాను. మనమంతా నిజాయితీగా మాట్లాడుకుందామని. నిజమే మాట్లాడుతున్నారని ఎదుటి వాళ్ళని నమ్మాలి. గొడవలు వద్దు. మీ సంగతేంటి రమేష్!"

రమేష్ అన్నాడు.

"నేను వేశ్యలకు పోతుంటాను. కాని సంసార్లను వేశ్యలుగా చూడలేను"

"అంటే?"

"సాగర్ మిసెస్ చాల అమాయకురాలు. నేను, సాగరు క్లోజ్‌గా ఉంటామని మీకు తెలుసు. ఓ రోజు వాడు బాత్రూంలో స్నానం చేస్తుంటేనే ఈవిడ నాతో అంది. నేను చాలా ప్లెయిన్‌గా చెప్పాను - మీరిలా ఎవరితోనూ అనకూడదు. మగాళ్ళ సంగతి మీకు తెలియదు. మీరు అతన్ని ఏ డాక్టరు దగ్గరకయినా తీసుకెళ్ళండి - ఏమనుకున్నారో ఏమో మళ్ళీ ఆ విషయం ఎప్పుడూ ప్రస్తావించలేదు. వాళ్ళింటికి వెళ్తూనే ఉన్నాను - పార్టీలకు సాగరే కాదు ఎవరు రాకపోయినా నాకు పట్టింపులేదు కనుక పట్టించుకోలేదు"

రమేష్ చెప్పటం ముగించి, చేతిలో వేసుకుని నలుపుకున్న తంబాకుని, నోట్లో వేసుకున్నాడు.

జగన్నాథంతో సహా ఎవ్వరూ మాట్లాడలేదు కొంతసేపు.

పురుషోత్తం అన్నాడు -

"మరోలా భావించనంటే ఒక్క ముక్క చెపుతావా రమేష్?"

"చెప్పండి!"

"వేశ్యల దగ్గరకు పోయే మనుషులు ఛాన్సొస్తే వదలరు"

"వేశ్యలకు పోనివాళ్ళు వదులుతారన్నమాట?" - పెంకిగా ఉంది రమేష్ గొంతు.

"అంతే మరి!" అన్నాడు పురుషోత్తం.

"వేశ్యలకు పోయేవాళ్ళు వాళ్ళ డబ్బు పెట్టుకు ఎంజాయ్ చేస్తారు. ఫ్రీగా వస్తే ఫినాయిలైనా తాగేసే రకాలు ఎవడు మందు పోయించినా తాగేస్తారు. నీతీ జాతి లేకుండా ఎక్కడయినా ఏదయినా ఫ్రీగా దొరుకుతుందా అని చూస్తుంటారు"

రమేష్ అలా అనేసరికి పురుషోత్తం గొంతు పెంచుతాడని గొడవ ముదురుతుందని కంగారు పడ్డాడు జగన్నాధం. పురుషోత్తం మొహం మాడిపోయింది మాట్లాడలేదు.

"ఇంకెవరూ ఏం చెప్పక్కర్లేదు. పదండి పోదాం" అన్నాడు జగన్నాధం.

హోటలు బిల్లు చెల్లించాడు రమేష్.

అందరు బయటకు వచ్చాక పురుషోత్తం అన్నాడు.

"సాగర్ ఏర్పాట్లన్నీ చేసుకునుంటాడు. మనం వెళ్ళకపోతే బాగుండదు"

ఆ మాటకు రమేష్ ఫక్కున నవ్వాడు.

పురుషోత్తం విసురుగా వెళ్ళబోతుంటే జగన్నాధం చెయ్యి పట్టుకు ఆపాడు.

"మనం రామని ఖచ్చితంగా సాగర్‌కి చెప్పలేదు. అందరము కట్టగట్టుకు వెళ్ళకపోతే... ఏమనుకుంటాడో!" అన్నాడు.

కొంతసేపు తర్జన భర్జనలు తర్వాత అందరూ వెళ్ళాలని నిర్ణయం తీసుకున్నారు.

అంతా వెళ్ళేసరికి సాగర్ చక్కగా అన్నీ సర్ది ఉంచాడు. ప్లేట్లలో తినుబండారాలున్నాయి. పేకలు ఎదురు చూస్తున్నాయి. ఎక్కడా మందు కనబడకపోయేసరికి అంతా ఒకరి మొహాలు ఒకరు చూసుకున్నారు.

"లోపలుంటుంది" అన్నాడు పురుషోత్తం సాగర్ లోపలికి వెళ్ళగానే. రమేష్ నవ్వు మొహం చూసి పురుషోత్తం మొహం తిప్పుకున్నాడు.

సాగర్ ప్లేట్లు, కప్పులూ, ప్లాస్కుతో వచ్చాడు.

టీ పోసి ఇచ్చాడు సాగర్.

"పార్టీ అంటే ఏంటో అనుకున్నానోయ్ సాగర్!" అన్నాడు గోపాలం టీ తాగుతూ.

"ఏం చెయ్యమంటారు సార్? మందుని నేను పందెంలో ఓడిపోయాను" అన్నాడు సాగర్ పేకముక్కలు కలుపుతూ.

"పందెమేంటి? ఎవరితో?" అన్నాడు జగన్నాధం.

"ఇంకెవరితో సార్? మా ఆవిడతో!"

"ఏడాది తిరక్కుండా నిన్ను తండ్రిని చేస్తానన్నారా?" అన్నాడు కామరాజు.

"మీ చెల్లాయి అలాంటి పందెం కాయలేదు కామరాజూ!" అన్నాడు సాగర్.

అంతా నిశ్శబ్దమయిపోయారు.

కలుపుతున్న పేక కింద పడేసి సాగర్ అందరినీ చూసాడు.

"పెళ్ళయ్యాక కూడ మీ వెనకాల తిరుగుతూ పేకలోనూ, మందులోనూ పడి కొట్టుకుపోతున్న నన్ను ఓ రోజు మా ఆవిడ రాధ పట్టుకుంది. ఏం చెయ్యమంటావు? సోషల్ ఏక్టివిటీ లేకుండా ఎవరూ ఉండలేరన్నాను. వాళ్ళంతా నా బెస్ట్‌ఫ్రెండ్స్! ఫ్రెండ్స్

కోసం కొన్ని తప్పవన్నాను"

"నీకు బెస్ట్‌ఫ్రెండ్స్ ఎవరూ కారని ఋజువు చేస్తాను. పందెం కాస్తావా?" అని అడిగింది.

'ఎలా ఋజువు చేస్తా'వని అడిగాను.

'అదంతా నీకు నేను ప్లాన్ చేసి చెబుతాను. పందెం కాస్తావా?' - అంది.

'సరే! నేను గెలిస్తే ఏమిస్తావు' - అని అడిగాను.

'ఇంట్లోనే మీ మందుకి, పేకకి నేను ఏర్పాట్లు చేస్తాను' - అంది.

'నేను గెలిస్తే మందు ముట్టనని ప్రమాణం చెయ్యాలి' - అంది.

తప్పుతుందా - ఒప్పుకున్నాను.

అప్పుడు తన ప్లాను చెప్పింది. నీకిలాంటి ఆలోచన ఎలా వచ్చిందని తిట్టాను. ఆవిడ ఫ్రెండ్ గీతట. ఆ గీత ఉపదేశమట.

చివరకు ఒప్పుకున్నాం!

"నా భార్యని చెల్లెల్లాగానో, కూతుర్లాగానో భావించితే - అయ్యో! కొత్త కాపురం! చిన్నవాళ్ళు! అని బాధపడాలి. నా స్నేహితుడి పట్ల నాకు బాధ్యత ఉందని భావించాలి. నాతో మాట్లాడి నన్ను ఒప్పించి డాక్టరుకు చూపించే ప్రయత్నం చెయ్యాలి! మీలో ఎవరేమనుకున్నారో గాని నాతో ఎవరూ మాట్లాడలేదు. దాంతో నేను ఓడిపోయాను సార్!" అన్నాడు సాగర్.

రమేష్ మాట్లాడే దాకా ఎవరూ మాట్లాడలేదు.

"సాగర్! మీ షరతుల ప్రకారం, అంచనాల ప్రకారం మాలో ఎవరమూ స్నేహితులుగా మంచివాళ్ళు కాకపోవచ్చునుగాని... మీ మిసెస్‌తో ఎవరమూ హద్దు మీరలేదు."

"అదే మేమూ అనుకున్నాం! మీరంతా మంచి మనుషులే. కనీసం చెడ్డ చేసే తెగింపు లేనివాళ్ళే. ఒప్పుకుంటాను! కాని... స్నేహం వేరంటుంది రాధ. ఎదుటి వాళ్ళ జీవితాన్నీ, వాళ్ళ సమస్యలనీ స్వంతంగా భావించి పరిష్కరించడానికి ప్రయత్నించకపోతే అది స్నేహమేమిటి? అంటుంది మా ఆవిడ ఫ్రెండ్ గీత."

ఎవ్వరూ మాట్లాడలేదు.

"కాని మాకు ఓ ప్రశ్న మిగిలిపోయింది. మీలో ఎవరూ అత్యుత్తమ స్నేహితులు కాకపోవచ్చును గాని ఉన్నంతవరకూ మీలో ఎవరు ఉత్తమ మానవుడూ అన్నది ప్రశ్న - మీ అయిదుగురూ మీకు అనిపించిన మంచి మనిషి ఎవరో ఓ కాగితం మీద రాసి ఇక్కడ పడేయండి! ఎవరికి ఓట్లు ఎక్కువ వస్తే వాళ్ళే మంచివాళ్ళు" అన్నాడు సాగర్!

అంతా రాసి ఓ గ్లాసులో పడేశారు.

సాగర్ ఆ అయిదు కాగితాలు తీసి చూడసాగాడు.

**కథాప్రహేళికలో కలం పట్టిన పాఠక మహాశయులకు అభినందనలు!**

'సయ్యాట' కథా నిర్మాణంలోని కృత్రిమతను, అసహజత్వాన్ని, అసంబద్ధతనీ మీలో 90% మంది బైటపెట్టారు. ఆడవాళ్ళను యిళ్ళలో వదిలి మగవాళ్ళు పేకాట, మందులో గడపటం సర్వే సర్వత్రా కనిపించే విషయం. ఈ విషయాన్ని కృతకమయిన అంతర్నాటకంతో కథలోని పాత్రలు పరిష్కరించటం అసహజమని మీలో చాలామంది భావన.

పోతే - మగవాడి నైజాన్ని బట్టబయటలు చేసినందుకు కొందరు స్త్రీ పాఠకులకు 'రాధ' పాత్ర నచ్చింది. అందుకే కొందరు మగ పాఠకులకు నచ్చలేదు. స్నేహం మీద ఓ పాత్ర అన్న మాటనూ, వివరణనూ మెరుగైన అంశంగా అనేకమంది పేర్కొన్నారు. కథనంలో సస్పెన్సు చాలామందిని ఆకట్టుకుంది.

దీన్ని బట్టి తేలేదేమిటి?

కథని అర్థం చేసుకునే శక్తి, నిత్యజీవితంలో జరుగుతున్నట్లనిపించే సహజమైన కథ పట్ల ఆసక్తి తెలుగు పాఠకులకి పుష్కలంగా ఉంది అని.

కాబట్టి -

మీరు మీ నిర్మొహమాటమయిన అభిప్రాయాలను వ్రాతలో తెలియజేస్తూ ఉంటే తెలుగు కథ వెలుగు కథ కాక ఏమవుతుంది? ఎంత ఎక్కువమంది తమ యిష్టాయిష్టాలను వ్యక్తపరిస్తే అంతగా ప్రజాస్వామ్య వేదికలు తమ లక్ష్యాలను సాధిస్తాయి గదా! పత్రికలు కూడా బలమైన ప్రజాస్వామ్య వేదికలే గదా! మీ అభిరుచులకే కదా పత్రికలు ప్రాధాన్యమిస్తాయి! మీరు మెచ్చే కథలు వేస్తాయి! రచయితలు రాస్తారు!

'సయ్యాట' కథలో నచ్చని అంశం దాదాపు అందరూ ఒకటి చెప్పారు. కనక స్పష్టతనీ, విషయ వివరణనీ, సక్రమ తర్కాన్ని బట్టి ఈ క్రింద లేఖలకు బహుమతి ఇస్తున్నాం:

(1) మొదటి బహుమతి : **ఎమ్.ఎస్. కుమార్**, విశాఖపట్నం.

(2) రెండవ బహుమతి : **వి. తేజస్వి**, ఏలూరు.

ఇలాంటి కథలలో కూడా కొన్ని మెరుపులూ, మెలకువలూ ఉండొచ్చు - ఆలోచించాల్సిందే! అలాంటి అభిప్రాయాలలో యీ రెంటినీ ఎంచాం!

(1) **సగినేటి రవిరాజు**, భీమాళి

(2) **పి. వాణీకృష్ణ**, హైదరాబాద్

పోతే -

'కథాప్రహేళిక'లో మొదటి మూడు కథల మధ్య సంబంధం ఉందా? ఏమిటిది? ఇది కొంత సులువుగానే మీరు పోల్చగలరు. కనక -

మాకు అందిన మొదటి మూడు సరైన లేఖలకూ ప్రత్యేక బహుమానం!

అంతే కాదు - ఈ నెల కథ మీద మీకు నచ్చినదేమిటో, నచ్చనిదేమిటో ఎలాగూ చెపుతారు! వాటికి మామూలు బహుమతులెలాగూ ఉంటాయి.

కనక త్వరపడండి-

ఇందులో పాల్గొన్న పాఠకుల సంఖ్య ఎక్కువగా ఉండడం వల్ల డ్రా తీసి యిరవై మంది పేర్లు యిస్తున్నాం : (1) కె. రామారావు (హైదరాబాద్) (2) బోణం నాగేంద్రకుమార్ (తుందుర్రు) (3) వి. జగదీష్ (వరంగల్) (4) డి. సువర్ణకుమార్ (విశాఖ), (5) టి. గణపతిరావు (విశాఖ), (6) కె. శ్రీధర్ (అనకాపల్లి), (7) యం. సూర్యప్రకాశరావు (రామరాజులంక), (8) ఎ.వి.యస్. శ్రీనివాస్ (దరిశి), (9) జి. వెంకటేశ్వర్లు (జగ్గంపేట), (10) జి.వి. కృష్ణారావు (నిడదవోలు), (11) పి.పి. వరప్రసాదరావు (నెల్లూరు), (12) జి. ప్రేమ్‌కుమార్ (పఠాన్‌చెరువు), (13) బి. లక్ష్మీజయప్రద (ముట్లూరు), (14) యం. శ్రీకృష్ణ (విశాఖ), (15) జోగారావు. జి (ఖరగ్‌పూర్), (16) కె.యస్.యన్. కృష్ణ (కొత్తవలస), (17) దాసరి విజయభాస్కర్ (చీరాల), (18) డి. అరుణ్‌కుమార్

(విజయవాడ), (19), రూపాకుల రమణ ప్రసాద్ (న్యూఢిల్లీ), (20) చింతా సుమమాల (ఔరంగబాద్)

నచ్చిన అంశం

## మొదటి బహుమతి పొందిన విశ్లేషణ

'సయ్యాట' కథలో రచయిత కథనాన్ని సస్పెన్స్‌తో ఆఖరి వరకు నడిపించారు. కథలో ఏం జరుగుతుంది అన్నది ముందే తెలియకపోవడం వల్ల పాఠకున్ని ఆఖరి వరకు చదివిస్తుంది.

రచయిత ఒక పాత్ర చేత చెప్పిన ఆ వ్యాఖ్య - "మీరంతా మంచి మనుషులే. కనీసం చెడ్డ చేసే తెగింపు లేని వాళ్ళే. ఒప్పుకుంటాను! కాని స్నేహం వేరంటుంది రాధ. ఎదుటి వాళ్ళ జీవితాన్ని వాళ్ళ సమస్యలని స్వంతంగా భావించి పరిష్కరించడానికి ప్రయత్నించక పోతే అది స్నేహమేమిటి?" పాఠకున్ని ఆలోచింపచేస్తుంది. ఈ కథలో నచ్చిన అంశాలివి.

కథలోలా ఇలాంటి పందేనికి ఏ స్త్రీ ఒప్పుకోదు. ఇదే ఈ కథలో నచ్చని అంశం.

- సగినేటి రవిరాజు

## రెండవ బహుమతి పొందిన విశ్లేషణ

'కథాప్రహేళిక' శీర్షికలో ఈ నెల కథ "సయ్యాట" ఓ చక్కని కథ. కథ, కథనం రెండూ చాలా బాగున్నాయి. అవసరం లేని పాత్రలు, అనవసరమైన సన్నివేశాలు, అఖ్ఖర్లేని సంభాషణలూ మచ్చుకకి కూడా లేవు. కనిపించవు.

కథ ప్రారంభించిన విధానం బావుంది. అక్కడ నుంచి కథను నడిపిన తీరు,పాఠకుల ఊహకి అందకుండా చివరి వరకూ పకడ్బందీగా, సస్పెన్స్ మెయిన్‌టెయిన్ చేసిన పద్దతి బ్రహ్మాండం. సింప్లీ సుపర్బ్.

కథలోని ముఖ్యపాత్రలే కాకుండా కథ చదువుతున్న పాఠకులు కూడా రాధని చెడుగా ఊహించుకుని 'అడ్డదారిలో అసహ్యంగా' అనుకుంటూ ఏం జరుగుతుందోనని ఆసక్తిగా ముందుకు సాగుతుంటే సున్నితమైన చెప్పెట్టి సుతిమెత్తగా చెంప మీద కొట్టినట్టుంది కథ ముగింపు.

ఇక సంభాషణల సంగతికొస్తే....

'నా భార్యని చెల్లెలుగానో, కూతురుగానో, భావించితే నా స్నేహితుడి పట్ల నాకు భాధ్యత ఉందని భావించాలి!'

'స్నేహితులుగా మేమెవరమూ మంచి వాళ్ళం కాకపోవచ్చు. కాని మీ మిసెస్‌తో ఎవరమూ హద్దు మీరలేదు.'

'మీరంతా మంచి మనుషులే - కనీసం చెడు చేసే తెగింపు లేని వాళ్ళే. కాని ఎదుటి

వాళ్ళ జీవితాన్ని, సమస్యలనీ సొంతగా భావించి పరిష్కరించడానికి ప్రయత్నించకపోతే అది స్నేహమేమిటి!'

'మీలో ఎవరూ అత్యుత్తమ స్నేహితులు కాకపోవచ్చు. కాని మీ ఐదుగురిలో ఉత్తముడు ఎవరు అన్నది మీరే నిర్ణయించండి?'

ఇవన్నీ మంచి ముత్యాలు. మేలిమి రత్నాలు.

– పి. వాణీకృష్ణ

నచ్చని అంశం

## ప్రథమ బహుమతి పొందిన విశ్లేషణ

ఈ కథలో నాకు నచ్చని అంశాలు చాలా వున్నాయి. మొదటగా అసలు గీతోపదేశం లోనే లోపం కనిపిస్తుంది. రాధ కాపురాన్ని చక్కదిద్దే ప్రయత్నంలో ఆమె భర్తనే అందరికీ నపుంసకుడని చెప్పమనటం సమంజసమేనా? గీత చెప్పినంత మాత్రాన, విచక్షణ లేకుండా, అదంతా అక్షరాలా అమలు జరపటం రాధ వ్యక్తిత్వ లోపం. చెడు స్నేహాలు మరిగిన తన భర్త దారి మళ్ళించి, అతని ప్రేమను కోరుకునే ఆమె ఆరాటం, అత్యాశ కాదు. ఇది పూర్తిగా ఆమె సంసారిక విషయం. ఇందుకు ఆమె స్వంతంగా మరో నిర్ణయం తీసుకుని వుంటే బావుండేది. మానభంగం జరిగితే ఆడది, నోరు విప్పి, చెప్పుకోలేని హైందవ సాంప్రదాయాలు మనవి. భర్త నిజంగా నపుంసకుడైనా చెప్పడానికి సంశయిస్తారు. ఒక వేళ చెప్పినా, ఏ తల్లితండ్రులకో, సన్నిహితులకో తప్ప, సూటిగా అతని స్నేహితుల ముందు వెల్లడి చేయటం అరుదు. పైగా ఆమెకు వారితో పూర్వ పరిచయాలు, చనువు అంతగా వున్నట్టు లేదు. మరి అలా చెప్పినప్పుడు, 'మరో' అర్థాన్ని వెదకని పురుషులు లోకంలో ఎంతమంది వుంటారు? కేవలం ఒక పందెం కోసం ఇంతమంది దృష్టిలో నైతికంగా దిగజారిన రాధ, గెలుపుతో ఎలాంటి ఆనందాన్ని పొంది వుంటుంది? ఈ వ్యవహారమంతా సాగర్ అనుమతితో అరగటం మరో విడ్డూరం. ఎక్కడైనా తన అశక్తతను అంగీకరించగలిగే మగవాడు, సెక్స్‌లో మాత్రం తన బలహీనతను భరించలేడు. అలాంటప్పుడు తనలో లేని లోపానికి జరగబోయే 'మౌత్ ఏక్టివిటీ' అతనికుంది. 'బెస్ట్‌ఫ్రెండ్స్' అనబడే ప్రాణమిత్రుల పట్ల అతని అవగాహన ఎంతవరకో కథ ముగింపు తెలియజేస్తుంది. "మేము మంచి వాళ్ళం కాకపోవచ్చు. కానీ మీ మిసెస్‌తో ఎవరమూ హద్దు మీరలేదు" అనే వాక్యాలున్నాయి. అంటే హద్దు మీరనంత వరకూ ఫరవాలేదు. మానసిక వ్యభిచారం ఎన్నాళ్ళు చేసినా తప్పు కాదనా రచయిత అభిప్రాయం? కలల్లో స్త్రీ సెక్సప్పీల్ ఊహించుకునే జగన్నాథానికి, డిగ్రీ చదివే కూతురుందని వ్రాయటం, మరికొంత జుగుప్స కలిగించటానికి దోహదపడింది. "నేను వేశ్యలకు పోతుంటాను.

కానీ సంసార్లను వేశ్యలుగా చూడలేను" అని నిష్కర్షగా చెప్పిన ఒక వేశ్యాలోలుడు, ఇలంటి సంసారుల కంటే ఎంత మెరుగు! భార్యను కామించినందుకు గానూ, సాగర్‌కు వాళ్ళెవరూ అత్యుత్తమ స్నేహితులు కాలేకపోయారట. కానీ ఉన్నంతలో 'ఉత్తముడు' ఎవరో తెలుసుకోవటానికి, బాలెట్ ద్వారా అతడు ఎన్నిక జరిపిన తీరు కథలోని అసంబద్ధతకు పరాకాష్ఠ. (బహుశా ఆ వ్యక్తి రమేష్ అని రచయిత భావించి ఉండవచ్చు). భార్యాభర్తల సరస శృంగాలకు సంబంధించిన పదం "సయ్యాట" ఈ కథకు టైటిల్‌గా సరిపోయిందో, లేదో ఒకసారి పరిశీలించాలి.

- ఎమ్.ఎస్. కుమార్

**రెండవ బహుమతి పొందిన విశ్లేషణ**

'కథాప్రహేళిక' శీర్షికన దీపావళి ప్రత్యేక సంచికలో ప్రచురించిన "సయ్యాట" పరమ చెత్తగా ఉంది. చౌకబారు ట్విస్టు చుట్టూ అల్లిన ఈ కథలో మరో ముఖ్య లక్షణం చదివించే గుణం భూతద్దం పెట్టి వెతికినా కానరాలేదు. కథా ప్రారంభమే కన్‌ఫ్యూజింగ్‌గా, వాక్యాల మధ్య సమన్వయం, అర్థం లోపించి అసందర్భంగా ఒకటికి రెండుసార్లు చదివినా అర్థం కాని ఆధునిక కవిత్వంలా చిరాకెత్తించింది.

మధ్యతరగతి జగన్నాథమంటే రచయితకు ఇంత కడుపు మంట ఎందుకో అర్థం కాదు. జగన్నాథం భావోద్వేగాల మీద సంఘటనా పరమైన సానుభూతి కలిగించవలసింది పోయి రాధను అనుభవించడమే ఏకైక లక్ష్యంగా సాగిన చిత్రణ రచయిత అపరిపక్వతకు, అతితెలివికి అద్దం పడుతుంది.

ఇంతకీ ఈ కథలో ఏం చెప్పదలచాడు ఈ రచయిత?

ఈ కథ వల్ల ఏమిటి ప్రయోజనం? ఎవరికి ప్రయోజనం?

ఇతివృత్తపరంగా బలహీనమైన అంశం తాలూకు లోపాన్ని కప్పెట్టడానికి రాధా - జగన్నాథాల మధ్య అనవసరపు శృంగార భావనలు వర్ణించి పాఠకుడి బలహీనతలపై ఆడుకోవటం క్షమార్హం కాని నేరం.

రాధా - సాగర్‌ల మధ్య రేకెత్తిన పందెం కానీ, దాన్ని భర్తగా సాగర్ ఆమోదించటం కానీ వాస్తవానికి పచ్చి విరుద్ధం కాదా?

పాఠకుల అభిరుచిని అంచనా వేయడానికి మరీ ఇంత దిగజారుడు కథలతో ప్రయత్నించడం 'రచన' చెప్పుకున్న నిబద్ధతకు, నిలబడిన ఆశయానికే విరుద్ధంగా ఉన్నాయి.

ఈ శీర్షిక ఇలానే కొనసాగే పక్షంలో 'రచన' పత్రికకీ ప్రత్యేకత లేదనే అనుకోవాల్సి వస్తుంది.

- వి. తేజస్వి